
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సిద్దిపేట
5
ఆదివారం 9 జూన్ 2024

కోతకొచ్చిన ఆయిల్‌పామ్ పంట
- నంగునూర్ మండలంలో నేడు 20 ఎకరాల్లో కోత
- 3 టన్నుల దిగుబడి రానున్నట్టు అంచనా
- రెండు మూడు నెలల్లో వెయ్యి ఎకరాల్లో పంట చేతికి
- జిల్లా వ్యాప్తంగా 11,118 ఎకరాల్లో సాగు

7



లినెన్ కాటన్ చీర నేస్తున్న నేత కార్మికుడు

సరికొత్త ప్రస్థానం

దుబ్బాక చేనేతలకు లినెన్ వెలుగులు

వస్త్రానికి రంగులద్దే రసాయనమే భిక్షె. ప్రాణాలను వదిలిన అభాగ్య కుటుంబాలు.. నమ్ముకున్న మగ్గం పట్టెడు మెతుకులు పెట్టకపోవడంతో నైట్రేట్‌ను మింగి లోకం వదిలిన దీనగాథలు.. ఎవరో వస్తారు, ఆదుకుంటారు అని ఎదురుచూసి చూసీ మోసపోయిన దీనార్థులు.. వారే రెండు దశాబ్దాల పాటు ఆకలి చావులతో తల్లడిల్లిన దుబ్బాక నేతన్నలు..

నేడు ఆ చేనేతలు సంక్షోభం నుంచి సరికొత్త అధ్యాయం వైపు పయనిస్తున్నారు. ఆత్మహత్యల నుంచి ఆత్మస్థైర్యంతో కదులుతున్నారు. వస్త్ర ప్రపంచంలో తమ కంటూ ఓ గుర్తింపును తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మూస పద్ధతులను వదిలి, మార్కెట్‌ను ఒడిసిపడుతున్నారు. లినెన్ ఫ్యాబ్రిక్‌తో భిన్నమైన డిజైన్ వస్త్రాలను నేస్తూ వహ్వా అనిపించుకుంటున్నారు. తాజాగా వారు నేసిన వస్త్రం అయోధ్య బాలరామయ్య మేనును తాకడంతో పరవశించిపోతున్నారు.

- దుబ్బాక, జూన్ 8



చీర నేస్తున్న మహిళ

- సడుగులిరిగినా సవరించుకున్న మగ్గం
- మూస పద్ధతులు వీడి.. మార్కెట్‌ను ఒడిసిపట్టి
- లినెన్ వస్త్రాల తయారీతో దేశవ్యాప్తంగా గుర్తింపు
- అయోధ్య బాలరాముడి వస్త్రాలకు ఆర్డర్లు
- మార్కెట్ దీటుగా కదులుతున్న దుబ్బాక చేనేతలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి కరువైన ప్రోత్సాహం

జిల్లాలోని నేతన్నలు గతంలో 26 కౌంట్(సన్నరకం), 40 కౌంట్(దొడ్డరకం) కాటన్ చీరలు నేసే వారు. వాటిని ఊరూరా నిర్వహించే అంగళ్లల్లో అమ్ముకునేవారు. అనంతర కాలంలో పాలిస్టర్, సింథటిక్, నైలాన్, సూరత్ వెరైటీ చీరలు రావడంతో ఈ చేనేత వస్త్రాల అమ్మకాలను దెబ్బతీశాయి. రోజంతా నేస్తే నేత కార్మికుడికి రూ.50 కూలీ కూడా గిట్టుబాటు అయ్యేది కాదు. అటు చీరలకు ధర లేక, కనీసం ధోవతీలు నేద్దామంటే కట్టేవారు లేక నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆకలిచావులతో నేతన్నల ఉనికి ప్రశ్నార్థకమైంది. దీంతో మూడు దశాబ్దాల పాటు ఇక్కడి చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకుని విలవిలలాడింది. అయితే, సంప్రదాయ చీరలు, ధోవతీలకు స్వస్తి పలికే కాలం వచ్చిందని గ్రహించడంతో సరికొత్త అధ్యాయం వైపు నేతన్నల ప్రస్థానం మొదలైంది. వస్త్ర ప్రపంచంలో ముందుకు సాగాలనే సంకల్పంతో వారు మార్కెట్ లోతును పరిశీలించారు. లోటుపాట్లను సవరించుకుని దానికనుగుణంగా కొత్తదనం వైపు వెళ్లాలని నిర్ణయించుకుని అడుగులను ప్రారంభించారు. మొదట తువ్వాళ్లను, చేతిరుమాళ్లను తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. వాటితోపాటు లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌ను మార్కెట్‌కు తీసుకునివచ్చారు. అయితే, చీరల తయారీకి వారికి మొదట డిజైన్ సమస్య ఎదురైంది. కానీ, వారు నేస్తున్న లినెన్ షర్టింగ్, షూటింగ్‌కు మంచి డిమాండ్ ఏర్పడడంతో నేతన్నలు ఉత్సాహం నెలకొన్నది. వారు చీరలను తయారు చేయడంలోనే కొత్తదనాన్ని ఆవిష్కరించాలనుకున్నారు. దీని కోసం కొంతమంది డిజైనర్‌లను ఆశ్రయించారు. వారి సహకారంతో చేనేత మగ్గంపైనే వంద శాతం లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో చీరలను తయారు చేయడం మొదలుపెట్టారు. మరింతగా ఆకర్షించేందుకు కలకత్తా బ్లాక్ ప్రింట్ ఫ్యాబ్రిక్, జైపూర్ బ్లాక్‌ప్రింట్ భగ్రూలను తయారు చేశారు. డిజైనర్‌ల సూచన మేరకు దుబ్బాకలో నేసిన లినెన్ చీరలపై కసూతి హ్యాండ్ ఎంబ్రాయిడ్‌ను హన్మకొండ, బెంగుళూరు, ధారవాడ్ ప్రాంతాల్లో అందంగా చేయించి మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చారు. అంతేగాక కసూతీ నాగీ ఎంబ్రాయిడరీ నేసిన చీరలను లక్నోకు పంపించి, చికెన్‌కారీ ఎంబ్రాయిడరీ చేయిస్తూ, ఆకర్షణీయమైన చీరలను మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం లినిన్ ఇక్కత్ చీరలతో నెలకు సరాసరి రూ.25 వేల వరకు కూలీ పడుతుంది. రూ.200 చీరను నేసిన నేతన్న ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.20 వేల చీరను తయారు చేస్తున్నారు. నేత పనితో రూ.50 కూలీ తీసుకునే దగ్గరి నుంచి రూ.25 వేలు తీసుకునే వరకు ఎదిగారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్రాహమేది?

తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన దుబ్బాక చేనేత సహకార సంఘం మాత్రం ఇంకా కోలుకోలేకపోతుంది. సుమారు 5వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించిన చేనేత సహకార సంఘం మూడు దశాబ్దాల క్రితం సంక్షోభంలో పడి ఆత్మహత్యలకు వేదికగా మారింది. ప్రస్తుతం అందులో వంద మందికి కూడా ఉపాధి కల్పించలేని పరిస్థితి దాపురించింది. వాస్తవానికి దుబ్బాక చేనేత సహకార సంఘంలోనే లినెన్ వస్త్రాలకు మొదట ప్రయోగం చేశారు. అక్కడి నుంచే ఈ వస్త్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. అయితే, ప్రభుత్వం మూస పద్ధతులతో దొడ్డు వస్త్రాలు, పాలిస్టర్ వస్త్రాలకు మాత్రమే అనుమతినివ్వడంతో చేనేత సహకార సంఘానికి గడ్డురోజులు తప్పలేవు. ఈ నిర్ణయాలతో విసిగిన అప్పటివరకు చైర్మన్‌గా పనిచేసిన బోడ శ్రీనివాస్ సహకార సంఘం నుంచి విడివడి హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ సొసైటీని ఏర్పాటు చేశారు. దీని ద్వారా లినెన్ వస్త్రాలను తయారు చేసి, చేనేత కార్మికులు కొందరికీ ఉపాధి కల్పిస్తున్నారు. ఆయన ద్వారానే ప్రస్తుతం దుబ్బాక వస్త్రానికి గుర్తింపు లభించింది. అటు చేనేత సహకార సంఘం ద్వారా ఇలాంటి వస్త్రాలను నేయడానికి ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించలేకపోయినప్పటికీ, ఇటు కార్మికులు ఏర్పాటు చేసుకున్న స్వచ్ఛంద సొసైటీకి కూడా ఏ ప్రోత్సాహం ఇవ్వడంలేదు. కనీసం ప్రభుత్వం కొనుగోలుకు అవకాశం లేకపోవడంతో బయటి మార్కెట్ మీదనే ఆధారపడుతూ కాలం నెట్టుకువస్తున్నారు. దుబ్బాక లినెన్ వస్త్రాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తే చేనేతకు పూర్వవైభవం దక్కుతుంది.



దుబ్బాకలో నేసిన లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్ చీర



బాలరాముడి మేనుపై మెరిసి..

లినెన్ వస్త్రాల తయారీతో దుబ్బాక చేనేతలకు అరుదైన అవకాశం దక్కింది. మే 26న బాలరాముడిని ఇక్కడి నేతన్నలు నేసిన వస్త్రంతో అలంకరించారు. ఆ దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో అయోధ్య రామాలయ ట్రస్టు మరిన్ని ఆర్డర్లు ఇచ్చింది. అయోధ్య రాముడి ఏడు రోజుల అలంకరణకు వస్త్రాలు కావాలని డిజైనర్‌లకు ట్రస్ట్ సూచించింది. సోమవారం తెలుపు, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం క్రీమ్, శనివారం నీలిరంగు , ఆదివారం గులాబీ రంగుతో వస్త్రాలను డిజైన్ చేసి పంపాల్సిందిగా తెలిపారు. డిజైన్ ఆమోదం పొందగానే తయారు చేయడానికి ఇక్కడి నేత కార్మికులు సిద్ధమవుతున్నారు.

సోషల్‌మీడియా ద్వారా మార్కెటింగ్

సొసైటీ ద్వారా ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వేదిక ద్వారా దుబ్బాక లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్ వస్త్రాలకు గుర్తింపు వచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రెగ్యులర్ కస్టమర్‌లుగా సుమారు 5 వేల మంది చేరారు. అలాగే వీరి ద్వారా ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి గిరాకీ పెరిగింది. అంతేగాక దేశరాజధాని నుంచి ఎక్కువగా ఆసక్తి కలిగిన వినియోగదారులు ఇక్కడి నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. ప్రముఖ కంపెనీలు కూడా తమ డిజైన్‌లను అందించి, ఆర్డర్‌లను పొందుతున్నారు.

లోక్‌అదాలత్‌లో 8,723 కేసులు పరిష్కారం

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.7,71,000 పరిహారం
- చిన్నచిన్న కేసులకు కోర్టుల వెంబడి తిరగొద్దు
- జిల్లా న్యాయాధికారి సాయిరమాదేవి



జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి సాయిరమాదేవి

సిద్దిపేట క్రైం, జూన్ 8 : జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించి మొత్తం 8,723 కేసులను పరిష్కరించామని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి తెలిపారు. సిద్దిపేట కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు రాజీ మార్గమే రాజామార్గమని అన్నారు. చిన్న చిన్న కేసులకు డబ్బును, సమయాన్ని వృథా చేసుకుంటూ కోర్టుల వెంబడి తిరగవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులను పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఈ లోక్‌అదాలత్ సరైన వేదికని తెలిపారు. 2005కి సంబంధించిన ఈపీ కేసులను ఇరుపక్షాల సమక్షంలో పరిష్కరించారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.7,71,000 పరిహారం అందించారు. సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో 498 కేసులో భార్యాభర్తల ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించి కలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లె, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్.. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 8,223 అభ్యర్థులు

సిద్దిపేట క్రైం, జూన్ 8 : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 8,223 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. అందులో 13 మంది దివ్యాంగ అభ్యర్థులు ఉన్నారు. పరీక్ష కోసం సిద్దిపేట పట్టణంలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. మెయిన్ గేట్ వద్ద, పరీక్ష హాల్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి వచ్చే అభ్యర్థుల హాల్‌టికెట్‌ను, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించి లోపలికి పంపిస్తారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయనున్నారు. బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లు 9.30 నుంచి బయోమెట్రిక్ ద్వారా అభ్యర్థుల వేలిముద్రలను రికార్డు చేయనున్నారు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎగ్జామ్ హాల్ నుంచి ఎవరిని బయటకు పంపించరు. శనివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఏర్పాట్లను జిల్లా నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పర్యవేక్షించారు. అలాగే, డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టణంలోని 21 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సీసీ కెమెరాలు, పరీక్షా కేంద్రంలో రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్, టాయిలెట్లు, ఫర్నిచర్, తాగునీరు తదితర సౌకర్యాల కల్పనను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు తగు సూచనలు చేశారు. రూట్ ఆఫీసర్లు పరీక్ష పత్రాలను సెంటర్లకు చేరవేయడంపై ఇటీవల మాక్‌డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు పరీక్ష మెటీరియల్ ఉన్న స్ట్రాంగ్‌రూమును తెరుస్తారు. మాక్‌డ్రిల్ ప్రకారమే పరీక్ష సామగ్రిని ఎస్కార్ట్ వాహనాలతో గట్టి పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు చేర్చుతారు. సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్‌లకు అప్పగిస్తారు. పరీక్ష అనంతరం మళ్లీ ఎస్కార్ట్‌తో స్ట్రాంగ్‌రూమ్‌కు పరీక్ష మెటీరియల్‌ను చేరవేయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. 298 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ఉన్న ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని పోలీసులు ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లను అనుమతిని నిషేధించారు.



పరీక్షా కేంద్రంలో నెంబర్లను వేస్తున్న సిబ్బంది



పదోన్నతుల తర్వాత బదిలీలు

- టీచర్ల ట్రాన్స్‌ఫర్‌కు షెడ్యూల్ విడుదల
- 25 వరకు ప్రక్రియ పూర్తి
- బడిబాట.. బదిలీలతో బిజీబిజీ

సిద్దిపేట క్రైం జూన్ 8 : నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం మార్గదర్శకాలు జారీ చేసింది. దానికి సంబంధించిన షెడ్యూల్‌ని విడుదల చేసింది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు బదిలీల పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించారు. గత సంవత్సరం జనవరి నెలలో ఉపాధ్యాయ బదిలీల పదోన్నత నోటిఫికేషన్ విడుదలై కోర్టు కేసులతో ఆగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదే నోటిఫికేషన్ ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టారు. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవసరం లేదని, పాత నిబంధనల ప్రకారమే బదిలీలు పదోన్నతులు కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన అనంతర బదిలీలు చేయనున్నారు.

షెడ్యూల్ వివరాలు

ఈ నెల 8 నుండి 9వ తేదీ వరకు ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం, గ్రేడ్ -2 పండితులు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 10 నుంచి 11వ తేదీ వరకు పదోన్నతుల దరఖాస్తులను డీఈవో పరిశీలిస్తారు. 12, 13 తేదీలలో మార్గదర్శకాలు ఆధారంగా బదిలీలు, పదోన్నతుల సీనియార్టీ జాబితాను ప్రకటిస్తారు, అనంతరం దరఖాస్తుదారుల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరిస్తారు. 14, 15 తేదీల్లో అభ్యంతరాల నివృత్తి అనంతరం పదోన్నతులు, బదిలీల జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. 16 నుంచి 20 వరకు ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే ప్రక్రియ ఉంటుంది. 21 నుండి 24వ తేదీ వరకు ఎస్జీటీల బదిలీల ప్రక్రియ ఉంటుంది. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు నూతన పాఠశాలలో విధులకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఎస్జీటీల అసంతృప్తి

ప్రభుత్వం విడుదల చేసిన బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విధి విధానాలపై ఎస్జీటీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎస్జీటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,000 ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పిస్తామని మార్గదర్శకాలు జారీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 2,136కు కుదించింది. వాటిని టీటీసీ కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాత్రమే కల్పించాలని నిబంధన పెట్టడం పట్ల ఎస్జీటీ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు బిజీబిజీ

ఈ నెల 6వ తేదీన అన్ని పాఠశాలలో బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ బడీడుకు వచ్చిన పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 12వ తేదీన బడులు ప్రారంభమవనున్నాయి. అదే రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, దుస్తులు అందించాల్సి ఉంటుంది. విద్యాశాఖ అధికారులు వారం రోజుల నుంచి ఈ పనులలో నిమగ్నమైపోయారు. ఇదే క్రమంలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగాలని ప్రభుత్వం నుంచిమార్గదర్శకాలు రావడంతో, బడిబాటతో పాటు ఈ ప్రక్రియలో బిజీ బిజీగా ఉన్నారు.

జీవో 317పై తేలని పంచాయితీ

గత ప్రభుత్వం జారీచేసిన జీవో 317 ప్రకారం చాలామంది ఉపాధ్యాయులు తమ సొంత జిల్లాను వదిలి పొరుగు జిల్లాలో పని చేయాల్సి వచ్చింది. వేర్వేలు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలు ఒకే జిల్లాకు రావడానికి స్పౌజ్ కేటగిరిలో దరఖాస్తు చేసుకున్నారు. పక్క జిల్లాలో పనిచేస్తున్న సుమారు 300 మంది స్కూల్ అసిస్టెంట్ టీచర్లు స్పౌజ్ కేటగిరిలో సొంత జిల్లాకు వచ్చారు. సిద్దిపేట జిల్లాకు రావడానికి సుమారు 150 మందికిపైగా ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరిలో దరఖాస్తు చేసుకున్నారు. వారి ప్రక్రియను పెండింగ్‌లోనే పెట్టారు. ఇప్పటికీ వారి సమస్య ప్రశ్నార్థకంగా మారిపోయింది. అసలు స్పౌజ్ ఇస్తారా? ఇవ్వరా? అనే అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తాం

ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. జిల్లాలో పీజీహెచ్‌ఎం ప్రమోషన్లు, పీజీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ టీచర్ ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాయి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు, ఎస్జీటీ ట్రాన్స్‌ఫర్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత సంవత్సరం స్కూల్ అసిస్టెంట్ టీచర్లు బదిలీ అయిన వారి స్థానంలో సబ్‌స్టిట్యూట్ లేక రిలీవ్ చేయలేకపోయాం. ఇప్పుడు వారందరినీ రిలీవ్ చేస్తున్నాం.

- శ్రీనివాసరెడ్డి, డీఈవో





మృగశిర సందడి



మృగశిర కార్తె ప్రవేశంతో శనివారం జిల్లాలోని చేపల మార్కెట్‌లు సందడిగా మారాయి. సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోని చేపల దుకాణాలు కిటకిటలాడాయి. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఇప్పుడు చేపల కొనుగోలు భారీగా తగ్గాయని వ్యాపారాలు తెలిపారు. రవ్వ, బొచ్చ కిలోరూ.140, కొర్రమట్టలు స్థానికం అయితే కిలో రూ.500, బయటవి అయితే కిలో రూ.400 ధర పలికింది.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటో గ్రాఫర్

మూగజీవాలను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 8 : అనుమతి లేకుండా మూగజీవాలను తరలించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు దృష్టికి వస్తే సంబంధిత పోలీసులకు, లేదా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని సీపీ సూచించారు. అంతే తప్ప, స్వయంగా వెళ్లి అక్రమంగా అడ్డుకొని చట్టాన్ని చేతిలోకి తీసుకొని గొడవలు సృష్టించొద్దని కోరారు. అలా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా సరిహద్దు వరంగల్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి సరిహద్దులతో పాటు జిల్లా అంతటా ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీసులు, పశు సంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో పనిచేసి అక్రమ తరలింపునకు పాల్పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం కృషి చేయాలన్నారు.

ప్రయాణికుల భద్రతకు ఆటో డ్రైవర్లు ప్రాధాన్యమివ్వాలి

జిన్నారం, జూన్ 9: ఆటోలలో సురక్షిత ప్రయాణాల కోసం డ్రైవర్లు కృషి చేయాలని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ విజయ్‌రావు అన్నారు. శనివారం జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సురక్షిత ప్రయాణంపై సీఐ, ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆటోలు ప్రయాణించే మార్గాలను సూచించే షై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను వారికి అందజేశారు. ప్రయాణికుల భద్రతకు ఆటో డ్రైవర్లు అధిక ప్రాధాన్యమివ్వాలని అవగాహన కల్పించారు.



జిన్నారంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ విజయ్‌రావు

10న ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్ పరీక్ష

మెదక్ అర్బన్, జూన్ 8: ఇప్పటి వరకు ఇంటర్ ఒకేషనల్ కాకుండా జనరల్ సబ్జెక్టుల్లో కేవలం సైన్స్, మ్యాథ్స్‌లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టులోనూ ప్రాక్టికల్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఇంగ్లిషు భాషపై నైపుణ్యం పెంపొందించేందుకే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ నెల 10న ప్రాక్టికల్ పరీక్ష జరుగనుంది. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ పరీక్షకు 223 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. 11న పర్యావరణ, 12న నైతికత, మానవ విలువలుపై పరీక్షలు జరుగుతాయన్నారు.




నంగునూర్ మండలంలోని అక్కేనపల్లి గ్రామంలో సాగయిన ఆయిల్ పామ్ పంట, కోతకు సిద్ధంగా ఉన్న ఆయిల్ పామ్ గెలలు

కోతకొచ్చిన ఆయిల్ పామ్ పంట

- నంగునూర్ మండలంలో నేడు 20 ఎకరాల్లో కోత
- 3 టన్నుల దిగుబడి రానున్నట్టు అంచనా
- రెండు మూడు నెలల్లో వెయ్యి ఎకరాల్లో పంట చేతికి
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 11,118 ఎకరాల్లో సాగు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 8: సిద్దిపేట జిల్లాలో 2021 జూన్ 5న నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు మొదటి కోతకొచ్చాయి. అధిక ఆదాయం, తక్కువ పెట్టుబడి ఉండే ఆయిల్‌పామ్ సాగుకు గత ప్రభుత్వం ప్రోత్సహించగా.. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతులకు అనేక అవగాహన సదస్సులు నిర్వహించి సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు కృషి చేశారు. జిల్లాలోని నంగునూరు మండలంలో మొదటగా మొక్కలు నాటగా.. 20 ఎకరాల్లో పంట కోతకు వచ్చింది. ఈ నెల 9న పంటను కోసి, అశ్వరావు పేటకు ఆయిల్ ఫెడ్ అధికారులు తీసుకెళ్లనున్నారు. రవాణా ఖర్చులు కూడా ఆయిల్ ఫెడ్ అధికారులే భరిస్తారు. దాదాపు 3 టన్నుల దిగుబడి రానున్నట్టు ఉద్యానశాఖ, ఆయిల్ ఫెడ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ టన్ను ధర రూ.13 వేలకు పైగానే ఉన్నది. తొలిసారి పంటకు ఇంత మంచి ధర వచ్చినందుకు రైతులు సంబురపడుతున్నారు. ప్రతి ఆయిల్‌పామ్ చెట్టుకు 18నుంచి 20 గెలలు ఉన్నాయి. ఒక్కొక్క గెల ఐదు నుంచి 15 కేజీల వరకు ఉంటుంది. జిల్లాలో 11,118 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉండగా.. మరో రెండు, మూడు నెలల్లో 1,000 ఎకరాల్లో పంట చేతికి రానున్నది. జిల్లావ్యాప్తంగా తొలి విడతగా 2,700 ఎకరాల్లో మొక్కలు నాటగా.. ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,350 మంది రైతులు 11,118 ఎకరాలలో పామాయిల్ సాగు చేస్తున్నారు. మార్చి నాటికి మొత్తం 2,700 ఎకరాల్లో మొదటగా సాగుచేసిన వారి పంట దిగుబడి రానున్నది.

తొలిసారి పంటను కోస్తున్న



నేను ఏడెకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేశాను. మొదటగా 5 ఎకరాలు, మరో ఏడాదికి రెండు ఎకరాల్లో పంటను సాగు చేశాను. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇచ్చారు. మందుల వాడకానికి ఎకరానికి రూ.4 వేల చొప్పున నా ఖాతాలో జమ చేశారు. మూడేళ్ల నుంచి 30 ఏళ్లదాకా దిగుబడి వస్తుందంటే ఈ పంట వేసిన. కోతులు, అడవి పందుల బెడద కూడా తప్పింది. పంటను కోతకు వచ్చిందని అధికారులు చెప్పడంతో నేడు తొలిసారి పంటను కోస్తున్నాను.

– తిప్పని నాగేందర్, అక్కేనపల్లి, నంగునూరు మండలం

మంత్రి దామోదర్ చొరవతో

సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్



ఉత్తర్వుల ప్రతిని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

జోగిపేట/పుల్‌కల్, జూన్ 8: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గ వరప్రదాయిని సింగూరు కాల్వలకు మరో మహర్దశ పట్టింది. సుమారు 70 వేల ఎకరాలకు సాగు నీరందించే ఈ కాలువలను సిమెంటు లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.168.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగూరు కాలువల సిమెంటు లైనింగ్‌కు నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అందోలు నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూరు, అందోలు, మునిపల్లి మండలాలతోపాటు, సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని సదాశివపేట మండలంలో సుమారు 70 వేల ఎకరాలకు సింగూరు ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాల్వల ద్వారా ఏటా సుమారు 2 టీఎంసీల నీరు విడుదల అవుతుంది. కాల్వలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో వానలతో పాటు కాల్వల ద్వారా నీటివపారుదల సమయంలో కాల్వల గట్లు తడిసి మట్టి జారిపోయి కూలిపోతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన మంత్రి దమోదర్ వాటి పటిష్టతకు సిమెంట్ లైనింగ్ చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు. సిమెంట్ లైనింగ్ ఆవశ్యకతను మంత్రి దామోదర్ సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి ఆయనతో గ్రీన్ సిగ్నల్ ఇప్పించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సింగూరు కాల్వల లైనింగ్ కోసం రూ.168.30 కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల విడుదల పట్ల రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, పుల్‌కల్ మండల సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, పుల్కల్, చౌటకూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి, నత్తి దశరథ్, నాయకులు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, సురేందర్‌గౌడ్, బోయిని శ్రీనివాస్, అంజయ్య, ఉదయ్, ఇమ్రాన్, రవీందర్, గణపతి, దామోదర్, ప్రభుగౌడ్ మంత్రికి ధన్యావాదాలు తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోండి

- ఎక్సైజ్ అధికారులకు చిట్యాల గ్రామ మహిళల వినతి
- తాగిన మైకంలో దాడులు చేస్తున్నారని ఏకరువు



చేర్యాల ఎక్సైజ్ కార్యాలయానికి తరలివచ్చిన చిట్యాల మహిళలు

చేర్యాల, జూన్ 8: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళలు కోరతున్నారు. అడ్డగోలుగా జరుపుతున్న మద్యం విక్రయాలు తమ సంసారాల్లో చిచ్చుపెడుతున్నాయని వాపోయారు. తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న విషయమై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టుషాపులను మూసివేయించి, గ్రామంలో మద్యం అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మహిళలు శనివారం పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆశ్రయించారు. మొదటగా చేర్యాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా తామేం చేయలేమని, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సలహా ఇవ్వడంతో మహిళలంతా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని బెల్టుషాపుల్లో సమయపాలన అనేది లేకుండా ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తుండడంతో మందుబాబులు తాగిన మైకంలో అనర్థాలకు పాల్పడుతున్నారని వాపోయారు. కుటుంబ కలహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలు నివారిస్తేనే కుటుంబాలు బాగుపడతాయని పేర్కొంటూ, బెల్ట్‌షాపులు మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుడి అరెస్టు

- జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు
- జైలుకు వెళ్లొచ్చినా మారని బుద్ధి



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తాండ్ర వివేక్

అక్కన్నపేట, జూన్ 8: వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్ శనివారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా మోత్కూర్‌కు చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ మద్యానికి, గంజాయికి బానిసగా మారి, సులువుగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. గతంలో కరీంనగర్, వరంగల్, నల్గొండ, హుజూర్‌నగర్, జనగాం, భువనగిరి జిల్లాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలై వచ్చినా బుద్ధి మార్చుకోక మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే గత నెల 19న అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో కనకయ్య ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడు. గంగాధర మండలం వెంకటాయపల్లి స్టేజి వద్ద బైక్‌ను, మల్లంపల్లి గ్రామ పాఠశాలలో నల్ల పైపులను చోరీ చేశాడు. అంతకపేట గ్రామంలో చోరీ చేసిన సొమ్మును అమ్మేందుకు కొండగట్టుకు వెళ్లిన సాయిబాబా అక్కడ తన స్నేహితుడైన గంధం అర్జున్‌ను కలిశాడు. సొమ్మును అమ్మి పెట్టాలని చెప్పగా అర్జున్ రూ.60 వేలకు అమ్మి అందులో రూ.పదివేలు తాను తీసుకుని, మిగిలిన డబ్బును సాయిబాబాకు ఇచ్చాడు. ఆ డబ్బును సాయిబాబా జల్సాలకు ఖర్చు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శనివారం ఉదయం 5గంటల సమయంలో తన భార్య, పిల్లలను చూసేందుకు బైక్‌పై వెళ్తున్న సాయిబాబా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు తేలింది. నిందితుడి నుంచి 3 తులాల బంగారం, 16.6 తులాల వెండి, బైక్, రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకుని, హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

రాజ్యాంగాన్ని గౌరవిస్తేనే ప్రభుత్వాల మనుగడ

- కేంద్రంలో ఎన్డీయే మనుగడ కష్టమే
- కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

జహీరాబాద్, జూన్ 8: దేశంలో పాలకులు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, లౌకికవాదాన్ని అంగీకరించినప్పుడే ప్రభుత్వాల మనుగడ సాధ్యమని, కుల, మతాల పునాదులపై ఏర్పడిన ప్రభుత్వాల మనుగడ కష్టమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో రౌడీయిజం, ఫ్యాక్షనిజం, క్విడ్‌ప్రోకో విధానం పనికిరాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పరిస్థితిని ఇందుకు ఉదహరణగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తలుచుకుంటే ఏమైనా చేయగలుగుతారనడానికి లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు భయంతోనే బలవంతంగా ఎన్డీయే కూటమిలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీకి విశాలమైన దృక్పథం లేదని, అందుకే కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడ స్థానాలను సాధించలేకపోయిందని ఆయన పేర్కొన్నారు.

వెంచర్‌లో గంజాయి మొక్కల సాగు

- 12 మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు

సంగారెడ్డి టౌన్/జహీరాబాద్, జూన్ 8: వెంచర్‌లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్ పక్కనే ఉన్న తిరుమల డెవలపర్స్(వెంచర్)లో గంజాయి మొక్కలను సాగుచేస్తున్నారని నమ్మదగిన సమాచారం అందింది. శనివారం వెళ్లి తనిఖీ చేసి 12 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి మొక్కలను సాగుచేసిన రాఘవరెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎండి ఆలీం, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, మల్కయ్య తదితరులు పాల్గొన్నారు.



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఏడుపాయలలో ఇద్దరు మహిళల హత్య

- ఓ మహిళ హత్య కేసు విచారణలో మరో మహిళనూ చంపినట్లు నిందితుడి వెల్లడి

పాపన్నపేట, జూన్ 8: ఓ మహిళ మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని విచారిస్తున్న క్రమంలో సదరు మహిళతో పాటు మరో మహిళనూ హత్య చేసినట్లు చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారు. శనివారం మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన అనెల్లి అనసూయ(52) గత నెల 18న కనిపించకుండా పోయింది. ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి, సదాశివపేటకు చెందిన బసవరాజ్‌ను అరెస్ట్ చేశారు. అనసూయను ఏడుపాయలకు తీసుకెళ్లి, అక్కడ మద్యం సేవించినట్లు బసవరాజ్ తెలిపాడు. ఆ తర్వాత గొడవ జరగడంతో బండరాయితో మోదీ అనసూయను చంపినట్లు అంగీకరించాడు. ఈ కేసును విచారిస్తున్న పోలీసులకు నిందితుడు మరో మహిళను హత్య చేసినట్లు చెప్పడంతో ఆ కేసును కూడా పోలీసులు విచారించారు. అతడిచ్చిన వివరాల మేరకు శనివారం ఏడుపాయలకు వెళ్లిన పోలీసులు అక్కడ కోడిగుడ్ల పోచమ్మ(40) అనే మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. సదాశివపేటకు చెందిన కోడిగుడ్ల పోచమ్మ ఏడుపాయయలోని ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు కుమార్తె, ముగ్గురు కొడుకులు ఉన్నారు. అయితే, ఆమె 15 రోజుల క్రితం నుంచి కనిపించడం లేదు. కుటుంబీకులు సదాశివపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనసూయ మిస్సింగ్ కేసు విచారణలో నిందితుడు చెప్పిన వివరాల మేరకు పోచమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుడు చెప్పిన విధంగా రెండు హత్యలు 15 రోజుల క్రితమే జరిగినట్లు తేలడంతో అసలేం జరిగిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చంపుతున్నాడా, లేక రెండు హత్యలు చేయడం వెనుక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయ అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కేసు విచారణ పూర్తి అయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు వెల్లడించారు.

'యూనిఫామ్‌లను త్వరగా కుట్టివ్వాలి'



యూనిఫామ్ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

హుస్నాబాద్‌రూరల్, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫామ్‌లను త్వరగా కుట్టించాలని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య టైలరింగ్ శ్రీశక్తి సభ్యులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని శ్రీశక్తి స్వశక్తి టైలరింగ్ కేంద్రాన్ని సందర్శించారు. శ్రీశక్తి మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫామ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్, సెర్ప్ ఏపీఎం జీ. శ్రీనివాస్, డీఎంజీ, ప్రసాద్, సీసీలు బిక్షపతి, శివచరణ్‌సింగ్, రవీందర్, వీవోఏలు కనకతార, యమున, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఇంగువ, బెల్లం పంపిణీ

సిద్దిపేట టౌన్, జూన్ 8: మృగశిరా కార్తె సందర్భంగా సామాజిక కార్యకర్త గౌస్‌బాబా ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట పట్టణంలోని రైతుబజార్‌లో రైతులకు, వినియోగదారులకు రైతుబజార్ ఎస్టేట్ మేనేజర్ ప్రభాకర్ ఉచితంగా ఇంగువ, బెల్లాన్ని అందజేశారు.

ఈ ఏడాదైనా అందుబాటులోకి వచ్చేనా?

- ఏళ్లుగా నిరుపయోగంగా ఆడిటోరియంలు
- పట్టింపులేని అధికారులు, ప్రభుత్వాలు

గజ్వేల్, జూన్ 8: రూ.140కోట్ల వ్యయంతో నిర్మించిన బాల, బాలికల విద్యా సముదాయాల్లోని ఆడిటోరియంలను పట్టించుకునే నాథుడే లేక శిథిలమవుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాదైనా ఆడిటోరియాలను అందుబాటులోకి తీసుకువస్తారా అన్న సందిగ్ధత విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో నెలకొన్నది.

నిర్మించారు.. గాలికి వదిలేశారు

2019 నవంబరు 11న అప్పటి సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో ఎడ్యుకేషన్ హబ్‌లను ప్రారంభించారు. పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియేట్, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉండేందుకు ప్రభుత్వం హాస్టళ్లను ఏర్పాటు చేసింది. కానీ వాటికి అనుసంధానంగా నిర్మించిన ఆడిటోరియాలను మాత్రం గాలికి వదిలేసింది. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. ఇంకొన్నాళ్లు ఇలాగే వదిలేస్తే గోడలు సైతం కూలిపోయే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అందుబాటులోకి తెస్తే విద్యార్థులకు అవసరమయ్యే ఆయా కార్యక్రమాలు, సెమీనార్‌లను ఈ ఆడిటోరియంలో నిర్వహించుకునే వెసులుబాటు ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.



గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని ఆడిటోరియం అద్దాలు పగిలిన దృశ్యం



గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ఆడిటోరియం

బీరు సీసాలు.. పగిలిన అద్దాలతో..

బాలికల హబ్‌లో బీరు సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆడిటోరియంలోని ఎలివేషన్‌కు వేసిన అద్దాలు ధ్వంసమై య్యాయి. మరుగుదొడ్లు పూర్తిగా ధ్వంసమై, డోర్లు, కిటికీలు విరిగిపోయి ప్రజాధనం వృథా అవుతున్నది. ఆడిటోరియాలు చెత్త, చెదారం, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. బాలుర హబ్‌లోని ఆడిటోరియంలో వర్షాకాలంలో స్లాబ్‌లో నుంచి నీరు లీకేజీ అయి గోడలు పూర్తిగా నీరు పట్టి, శిథిలావస్థకు చేరుకున్నాయి. కాంట్రాక్టర్‌కు 2015లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణ బాధ్యతలు, ఆడిటోరియంల నిర్మాణ బాధ్యతలు అప్పగించగా, 2018నాటికి పెరిగిన ధరలతో గిట్టుబాటు కాక పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిసింది.

అందుబాటులోకి తీసుకురావాలి

కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన ఆడిటోరియాలను చివరి దశలో వదిలేయడం సరైన పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం స్పందించి పంద్రాగస్టులోపు ఆడిటోరియాలను అందుబాటులోకి తీసుకురావాలి. పంద్రాగస్టుకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ఆడిటోరియంలో నిర్వహించుకునేలా అధికారులు, అధికార పార్టీ నాయకులు కృషిచేయాలి. స్థానిక ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ ఈ విషయంపై దృష్టి పెట్టాలి.

- సందబోయిన ఎల్లయ్య
సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

136 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన రేషన్‌బియ్యం

దుబ్బాక, జూన్ 8: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని శుక్రవారం రాత్రి దుబ్బాక మండలం మల్లికుంట గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన పర్వతం నరేష్ అనే వ్యక్తి గూడ్స్ కంటైయినర్ వాహనంలో 136 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట నుంచి మెదక్ వైపు తరలిస్తుండగా.. మల్లికుంట గ్రామశివారులోని డివైడర్‌ను వాహనం ఢీకొట్టడంతో రోడ్డుకిందకు వెళ్లింది. జరిగిన విషయాన్ని వాహన యజమాని రాజుకు నరేష్ ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే మరో కంటైనర్‌ను రప్పించి, బియ్యాన్ని అందులో లోడ్ చేస్తున్నారు. సమాచారం అందడంతో ఎస్ఐ గంగరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాలను దుబ్బాక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం జిల్లా సివిల్‌సప్లై అధికారి రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ నరేష్, వాహన యజమాని రాజుపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి



వెంకటేష్ మృతదేహం

కొండపాక, జూన్ 8: ప్రమాదవశాత్తు టిప్పర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకున్నది. వనపర్తి జిల్లా పెద్దమందాడి మండలం వేల్‌టూర్‌కు చెందిన జింకల వెంకటేష్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తిమ్మారెడ్డిపల్లి శివారులోని ఓ వెంచర్‌లో టిప్పర్‌తో మట్టి దింపి హైడ్రాలిక్‌ను దింపకుండా అజాగ్రత్తగా వెళ్తుండగా విద్యుత్ వైర్లకు టిప్పర్ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య జింకల పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

సిద్దిపేట క్రైం, జూన్ 8: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన మల్లేశంపల్లి స్టేజ్ శనివారం చోటుచేసుకున్నది. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్‌కు చెందిన గడ్డం ఆంజనేయులు శనివారం పని మీదం దౌల్తాబాద్ నుంచి తిరుమలాపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లేశంపల్లి స్టేజ్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు కుడి కన్నుకు తీవ్ర గాయాలయ్యాయి స్థానికుల సమాచారంలో అక్కడికి చేరుకున్న 108లో స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మునిసిపల్ చైర్మన్ ఇలాకాలో సమస్యల తాండవం

- డ్రైనేజీ నుంచి ఉబికి వస్తున్న మురుగు
- చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడినా పట్టించుకునే నాథుడే లేడు

గజ్వేల్, జూన్ 8: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఇలాకాలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. అటు అధికారులు... ఇటు మునిసిపల్ చైర్మన్ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మునిసిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని హౌసింగ్ బోర్డులో డ్రైనేజీ నిండి నీరు ఉబికి బయటకు వచ్చి, నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ వద్ద మురికికూపంగా మారింది. దీంతో దోమలు పెరిగి చుట్టుపక్కల ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారు.



గజ్వేల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపైకి వచ్చిన చెట్టు కొమ్మలు



హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీ నుంచి ఉబికివస్తున్న మురుగునీరు

ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక అదే కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న రోడ్డుపై ఇటీవల వచ్చిన గాలిదుమారానికి చెట్టు కొమ్మ విరిగి కింద పడగా దాదాపు వారం రోజుల తర్వాత తీసివేశారు. అదే చెట్టు ఒక వైపునకు వంగడంతో చెట్టు కొమ్మలు రోడ్డుపైకి వచ్చినా ఏ అధికారి పట్టించుకోవడం లేదు. దీంతో ఆ రోడ్డు మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మునిసిపల్ చైర్మన్, వారి అనుచరులు, అధికారులు సదరు మార్గం గుండా తిరుగుతున్నా, సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ప్రభుత్వ ఉపాధ్యాయులు

నంగునూరు, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తున్నదని నంగునూరు హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం నంగునూరు ఉన్నత పాఠశాల, ఘనపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఘనపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన లభిస్తున్నదని, అలాగే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫామ్స్ అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, వంశీకృష్ణ, ఘనాపూర్ ఉపాధ్యాయులు వెంకటేశం, సువర్ణ, నరేష్ పాల్గొన్నారు.



నంగునూరు: ఈజీఎస్ కూలీలకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



సిద్దిపేట అర్బన్: బొగ్గులోనిబండలో బడిబాట

- **సిద్దిపేట అర్బన్:** బడిఈడు పిల్లలను బడికి పంపాలన్న నినాదంతో శనివారం సిద్దిపేట అర్బన్ మండలం గాంధీనగర్, బొగ్గులోని బండ, బట్టి రామన్నపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఏఎన్ఎం విజయ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, స్వప్న, లత, హెల్పర్స్ పూజ, ఆశా వర్కర్స్ సంతోష, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



చేర్యాలలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూన్ 8: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఉపఎన్నికల్లో ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ, శనివారం చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద బాణాసంచాకాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. పట్టభద్రులు ప్రశ్నించే గొంతుకను గెలిపించారని, మల్లన్న గెలుపు పట్టభద్రుల గెలుపు అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్‌లు ముస్త్యాల కిష్టయ్య, ఆడెపు చంద్రయ్య, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, తడక లింగమూర్తి, దాసరి శ్రీకాంత్, బందెల మహిపాల్‌రెడ్డి, ఎండీ ఖాజా, మామిడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తీన్మార్ మల్లన్న గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ శనివారం కొమురవెల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచ కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, సనాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి, పబ్బోజు రాములు, మల్లం బాలయ్య, ఉప్పల వంశీ, గుండా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నంగునూరు, జూన్ 8: నంగునూరు మండలం పాలమాకుల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని సిద్దిపేట టౌన్ ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సింగిల్ ఫేస్ విద్యుత్ మాత్రమే సరఫరా ఉంటుందన్నారు.

ఈ నెల 11న మూడో వార్షికోత్సవం



విలేకరులతో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్

ములుగు, జూన్ 8: మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ 3వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గీతాలక్ష్మి హాజరవుతున్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి 285 మంది విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేయనున్నట్లు వెల్లడించారు.

గుడి నిర్మాణ పనుల పరిశీలన

కుకునూరుపల్లి, జూన్ 8: కుకునూరుపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న బీరప్ప గుడి నిర్మాణ పనులను శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా ఆలయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో గుడి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

మూతబడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తాం

- ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జూన్ 8: జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో కొంతకాలంగా మూతబడిన పాఠశాలలను పునఃప్రారంభిస్తామని ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అలిరాజుపేట, నిర్మల్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలల భవనాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో పర్యటించి విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండుమూడు ఏళ్ల క్రితం విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయని, ప్రభుత్వం ఆదేశాల మేరకు వాటిని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



నిర్మల్‌నగర్‌లో అంగన్‌వాడీని పరిశీలిస్తున్న దృశ్యం

సీపీఎంను విమర్శిస్తే గుణపాఠం తప్పదు


- పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

చేర్యాల, జూన్ 8: కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ పదవిని కొనుకున్న పర్పాటకం లక్ష్మారెడ్డికి సీపీఎంను విమర్శించడం మానుకోకపోతే గుణపాఠం తప్పదని సీపీఎం కొమండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి హెచ్చరించారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీదైన ఆలయ భూములను కాజేయడానికి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి అడ్డు పెట్టుకుని మండలపార్టీ అధ్యక్షుడితో కలిసి అధికార దుర్వినియోగం చేస్తూ, అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆలయ భూముల ఆక్రమణపై నిగ్గుతేల్చేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బక్కెల్లి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన నోట్‌బుక్స్




లద్నూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి నోట్‌బుక్స్ అందజేస్తున్న సీఆర్పీలు

మద్దూరు, జూన్ 8: మద్దూరు మండల ఎంఆర్సీ కార్యాలయానికి వచ్చిన 11261 నోట్‌బుక్స్‌ను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు చేరవేసినట్లు ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలో 2021 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలు వారం రోజుల్లో రానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ అరుణ, సీఆర్పీ శోభారాణి తదితరులు ఉన్నారు.

రామోజీరావు మృతిపట్ల సంతాపం

సిద్దిపేట టౌన్/గజ్వేల్/హుస్నాబాద్, జూన్ 8: తనను సిద్దిపేట అబ్బాయ్ అంటూ ఆప్యాయంగా పిలిచే రామోజీరావు మృతిచెందడం అత్యంత బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ ఉమ్మడి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు, దేశానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు.రామోజీరావు మృతికి సంతాపంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జర్నలిస్టులు, ఆయా సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు యాదగిరి, నాయిని యాదగిరి, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, ఎల్లం, సుధాకర్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అంక్షారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సమీర్, ఆకుల ప్రభాకర్, నేత నాగరాజు, మన్నె కృపానందం, ప్రశాంత్ రాచకొండ, బీఎస్పీ నాయకులు రమణాకర్, టిల్లురెడ్డి, మద్ది నరేందర్, పేపర్ శ్రీనివాస్, అల్వాల యాదగిరి, గడీల సంజయ్ తదితరులున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, స్పూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ. అన్వర్, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ నాయకులు దొడ్డి శ్రీనివాస్, చిట్టి గోపాల్ రెడ్డి, ఎగ్గిడి అయిలయ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పిట్టల తిరుపతి, సతీష్, జనగామ రాజ్‌కుమార్, సంపత్, సుదర్శనచారి, సంజీవరెడ్డి, చంద్రారెడ్డి, వెన్న రాజు తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు వినతి



నర్సారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుకునూరుపల్లి, జూన్ 8: లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధించడానికి ఉపాధ్యాయుడు లేకపోవడంతో, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీసీ జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కందూరి అయిలయ్య శనివారం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఇనర్సారెడ్డి డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి లకుడారంలో బయలాజికల్ ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు.

ఆన్‌లైన్ ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు

- గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా

గజ్వేల్, జూన్ 8: ఆన్‌లైన్ ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా ఎన్‌సీసీ కెడెట్లకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలోని కెడెట్లకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు వీడియోకాల్స్ చేసి మాట్లాడడం, డబ్బులు అడుగుతూ బ్లాక్ మెయిల్ చేయడం, అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేయడం, గొంతు మార్చి మాట్లాడడం వంటి పనులు చేస్తూ వ్యక్తిగత సమాచారాన్ని రాబడతారని వివరించారు. అంతకుముందు రోగనిరోధకతపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగించారు. ట్రాఫిక్ సీఐ మురళీ కెడెట్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన మాజీ జడ్పీటీసీ

చేర్యాల, జూన్ 8 : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక రాజకీయ పరిస్థితులు, చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై చర్చించారు.

గజ్వేల్‌లో ఆర్యవైశ్య ఫెడరేషన్ ప్రమాణస్వీకారం

గజ్వేల్, జూన్ 8: గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో శనివారం ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఆయా కార్యవర్గాల ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య సంఘం జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ. రాజమౌళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సేవాతత్పరులు అని కొనియాడారు. వారితో మునిసిపల్ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, ఆయా విభాగాల అధ్యక్షులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జగదేవ్‌పూర్, జూన్ 8: జగదేవ్‌పూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి శనివారం అందజేశారు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిగడపకు చెందిన తలారి సదానందం కొద్దిరోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. అతడు జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఏఎస్ఐ వెంకటరమణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ చేతుల మీదుగా అందజేశారు.

పగలే వెలుగులు!



మండల కేంద్రంలో పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. అది కూడా గ్రామపంచాయతీ సమీపంలోనే. మండల కేంద్రంలోని గంగపుత్రుల వీధి, చుట్టుపక్కన ఉన్న మరో నాలుగు వీధుల్లోని వీధి దీపాలు 2 నెలల నుంచి పగటి పూట కూడా వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుండడంతో గ్రామపంచాయతీకి విద్యుత్ బిల్లు తడిసి మోపెడవుతున్నది.

- కుకునూరుపల్లి

రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు

- అందుబాటులో లేని కాంట్రాక్టర్
- సమస్యలతో పీహెచ్‌సీల సతమతం

మద్దూరు, జూన్ 8: జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని మద్దూరు మండలకేంద్రంతో పాటు లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, చాలా ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు కింద రూ.48 లక్షలు మంజూరు చేసింది. మద్దూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రూ.25 లక్షలు, లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రూ.23 లక్షల చొప్పున మంజూరు చేసింది. సంబంధితశాఖ అధికారులు పర్యవేక్షణ లేకుండాపోవడంతో గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మరమ్మతులతో పాటు పునరుద్ధరణ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. సకాలంలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేసినా పట్టకపోవడం శోచనీయం.



ఏడాది క్రితం లద్నూరు పీహెచ్‌సీలో పోసిన ఇసుక



నీళ్ల డ్రమ్ము అడుగు భాగం పగిలి లీకవుతున్న నీళ్లు

పట్టింపులేని కాంట్రాక్టర్

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాది క్రితం లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కేవలం రెండు ట్రాక్టర్ల ఇసుక పోసి ఇప్పటి వరకు అటువైపు తొంగిచూడలేదు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చేపట్టిన పనులు నాణ్యత లేమితో అధ్వానంగా మారాయంటూ ఆస్పత్రి సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్‌తో పాటు ఆస్పత్రికి రంగులు వంటి తదితర పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.


ఇసుకపోసి వెళ్లాడు



పనులు ప్రారంభించాలని రెండేళ్లుగా కోరుతున్నా కాంట్రాక్టర్ రావడం లేదు. ఇసుకపోసి వెళ్లాడు. ఫోన్ చేస్తే వస్తున్నా అంటున్నాడు తప్ప రావడం లేదు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదు.

-సువర్ధసన్ వైద్యాధికారి లద్నూరు

అధ్వానంగా పనులు



ఆస్పత్రిలో చేపట్టిన విద్యుత్, నీటి సౌకర్యం పనులు అధ్వానంగా ఉన్నాయి. పైపులైన్ పనులతో పాటు నీళ్ల డ్రమ్ము పగిలిపోయింది. బిల్డింగ్ మొత్తం నీళ్లు కారుతున్నాయి. ఎన్ని సార్లు చెప్పినా కాంట్రాక్టర్ రావడంలేదు.

-సుదయ్య యూడీసీ మద్దూరు